క్లుప్తంగా

ఇసుక తరలింపుతో పొలం నాశనం

కోసిగి: తమ పొలంలో రాత్రికి రాత్రే అక్రమంగా ఇసుకను తరలించి పొలాన్ని నాశనం చేస్తున్నారని దొడ్డి గ్రామానికి చెందిన హరిజన మునెమ్మ, చిన్న మునెమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన సర్వే నంబర్ 748, 751లో గల తమ పొలాలను రాత్రి వేళల్లో తవ్వి ట్రాక్టర్లతో ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పొలంలో పెద్ద పెద్ద గుంతలు పడి సాగుకు పనికి రాకుండా చేశారని వాపోయారు. ఇలాంటి వాటికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ రాజారెడ్డిని కోరారు.

అనువైన వంగడాలను ఎంచుకోవాలి

పెద్దకడబూరు: వాతావరణ పరిస్థితులను తట్టుకునే హైబ్రిడ్ రకాలకు చెందిన వంగడాలను ఎంచుకోవాలని వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ సూచించారు. మండలంలోని కల్లుకుంట గ్రామంలో శుక్రవారం ఆదోని గురుదత్తాత్రేయ ఫర్టిలైజర్ ఆధ్వర్యంలో రైతు ప్రదర్శన క్షేత్రాన్ని ఏర్పాటు చేసి మిరపలో అధిక దిగుబడి సాధించిన రైతు రఘును సన్మానించారు.

ధార్వాడకు వెళ్లి పింఛన్ అందజేత



ధార్వాడ హాస్పిటల్‌లో ఉశేనమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ రవికుమార్

కౌతాళం: మండలంలోని హాల్వి గ్రామానికి చెందిన ఉశేనమ్మ కర్ణాటక రాష్ట్రంలో ధార్వాడ లో నున్న ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ అక్కడికి వెళ్లి శుక్ర వారం ఆమెకు పింఛన్ సొమ్ము అందజేశారు.

మాంసం వ్యాపారులు శుభ్రత పాటించాలి

ఆదోని అర్బన్: మాంసం వ్యాపారులు దుకాణాలతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక కమిషనర్ చాంబర్‌లో చికెన్ సెంటర్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాంసంపై దుమ్ము, ధూళి పడకుండా, ఈగలు వాలకుండా గాజు పెట్టె ఏర్పాటు చేసుకోవాలన్నారు. మిగిలిన మాంసాన్ని ఎక్కడ పడితే అక్కడ పారవేయరాదని చెప్పారు.

శ్రీమఠం గోశాలకు విరాళం

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి మఠం నేతృత్వంలో నిర్వహిస్తున్న గోశాలకు బెంగళూరుకు చెందిన లక్ష్మీనరసింహ రూ.50 వేలు విరాళం అందజేశారు. శుక్రవారం నగదును మఠం మేనేజర్ శ్రీనివాసరావుకు అందజేశారు.

ఉప్పరహాల్‌లో జోరుగా అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో ఎంపీ నిధులతో చేపట్టిన పనులు జోరుగా సాగుతున్నాయి. రూ.16లక్షలతో బస్టాండు సమీపంలో డ్రైనేజీ కాలువలతో పాటు సిమెంటు రోడ్డు పనులు జరుగుతున్నాయని సర్పంచ్ తులసమ్మ, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుడు ఏకాంబర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. అన్ని కాలనీల్లో సీసీ రోడ్లకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఆయకట్టు రోడ్లు పూర్తి చేశామని, వంక బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యిందని చెప్పారు. అలాగే జెడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణ పనులు 1.60 కోట్లుతో జరుగుతున్నాయని పేర్కొన్నారు.

భావాజీ మఠంలో శ్రీమద్భాగవత ప్రవచనాలు



భజనలతో నృత్యం చేస్తున్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల వెనుక వెలసిన శ్రీ హథిరామ్ భావాజీ మఠంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈనెల 2 నుంచి శ్రీమద్భాగవత ప్రవచనాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 8వరకు జరిగే ప్రవచనాల్లో భాగంగా శుక్రవారం గురువులు నాగేంద్ర నారాయణ శాస్త్రి, సియారామ్ మిత్ర ద్వాపర యుగంలో శ్రీకృష్ణ లీలలను భక్తులకు వివరించారు. అనంతరం రాధేశ్యామ్‌ల వివాహం జరిపించి శ్రీకృష్ణ పాటలతో భజనలు చేశారు. నిర్వాహకులు, జిత్తు, దీపక్, భక్తులు పాల్గొన్నారు.

జోరుగా వరి నాట్లు

- తుంగా తీరం వెంట రెండోకారు పంట సాగు
- తుంగభద్ర ప్రాజెక్టులో పుష్కలంగా నీరు
- 35 వేల ఎకరాల్లో వరి, ఆరుతడి పంటల సాగు



వరినారు కట్టలు కడుతున్న కూలీలు

మంత్రాలయం : తుంగభద్ర ప్రాజెక్టులో పుష్కలంగా నీరుండటంతో నదీ తీర ప్రాంత రైతులు రెండో పంట సాగులో నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌లో భాగంగా సాగు చేసిన పంటల నూర్పిళ్లు పూర్తవడంతో ప్రస్తుతం వరి నాట్లు జోరందుకున్నాయి. అలాగే ఎత్తిపోతల పథకాల కింద కూడా పంటలు సాగవుతుండటంతో తీర ప్రాంతం మళ్లీ పచ్చదనంతో అలరారుతోంది.

జీవనాడిగా తుంగభద్ర..

నియోజకవర్గంలోని 3 మండలాలకు తుంగభద్ర నదీతీరం ఉంది. నియోజకవర్గ కేంద్రం నుంచి దాదాపు 60 కి.మీ. మేర తీరం ఉంది. కౌతాళం మండలం మేళిగనూరు మొదలు మంత్రాలయం వరకు నదీ తీరం ఉంది. 17 గ్రామాల సాగు, తాగునీటికి తుంగభద్ర నదీ జలాలే ఆధారం. తీరం వెంట దాదాపు 30 వేల ఎకరాల సాగు భూమి ఉంది. అందులో ఏపీఐడీసీ స్కీం పరిధిలో దాదాపు 15 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం నిర్ణీత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతోంది. మెండుగా వర్షాలు కురవడం.. పుష్కలంగా నదిలో వరద జలాలు పారడం.. పథకాలు నిర్విరామంగా నీటిని ఎత్తిపోయడంతో పంటలకు సాగునీటి ఎద్దడి తప్పింది. పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది రెండోకారు పైర్లు పచ్చదనంతో పరిఢవిల్లుతున్నాయి.

తుంగభద్ర డ్యాంలో జలకళ..

తుంగభద్ర డ్యాంలో 80.01 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. వానలు కురవడంతో నేటికీ రాష్ట్ర వాటా నీరు మిగిలే ఉంది. తుంగభద్రమ్మ తడారిపోకుండా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎండ కారు పంటకు నీరు సమృద్ధిగా లభిస్తుంది.

సాగు విస్తీర్ణం :

మంత్రాలయం మండలంలో సూగూరు ఎత్తిపోతల కింద 950 ఎకరాలు, మంత్రాలయం పథకం కింద 350 ఎకరాలు, చెట్నెహళ్లి స్కీం పరిధిలో 300 ఎకరాలు, మాధవరం పథకం పరిధిలో 250 ఎకరాలు, బూదూరు కింద 500 ఎకరాలు, మాధవరం-2 పరిధిలో 900 ఎకరాలు, కౌతాళం మండలం మేళిగనూరు పథకం కింద 432, కాత్రికి పరిధిలో 450 ఎకరాలు, లింగాలదిన్నె కింద 400, కుంభళనూరు పథకం కింద 1400 ఎకరాలు, అగసనూరు 600 ఎకరాలు, కడదొడ్డి 300 ఎకరాలు, కందకూరు 600 ఎకరాలు, బొమ్మలాపురం కింద 300 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. అలాగే నందవరం మండల పరిధిలో 27 కి.మీ. నదీతీరం ఉంది. అందులో కనకవీడు, సోమలగూడూరు, గురజాల, నాగలదిన్నె, మిట్టసోమాపురం, చిన్నకొత్తిలి, రాయచోటి గ్రామాల పరిధిలో దాదాపు 2 వేల ఎకరాల్లో వరి నాట్లు వేస్తున్నారు.



నాటు వేస్తున్న వ్యవసాయ కూలీలు

మూడేళ్లుగా మంచి రోజులు



2019 వరకు వానల్లేక నానా కష్టాలు పడ్డాం. మూడేళ్లుగా తీరం రైతులకు మంచి రోజులు వచ్చాయి. నదిలో వరద నీరు పుష్కలంగా పారుతోంది. రెండు పంటలు పండించుకుంటున్నాం. నాకున్న ఐదు ఎకరాల్లో రెండో కారు కింద వరి నాటు వేస్తున్నాం.

– సూర్యనారాయణ, సాతనూరు

పుష్కలంగా నీళ్లు



నదిలో పుష్కలంగా నీరు పారుతోంది. అలాగే డ్యాంలో మన వాటా నీరు ఉంది. దీంతో పంటలు చేతికొచ్చే వరకు సాగునీటి భయం లేదు. ఇలాంటి రోజులు పదేళ్ల క్రితం చూశాం. మళ్లీ ఇప్పుడు వచ్చాయి. ఈసారి రాజనాలు పండించాం. రెండో కారు కింద నాలుగు ఎకరాల్లో వరి నాట్లు వేశా. ఖరీఫ్‌లో దిగుబడి ఆశాజనకంగా వచ్చింది.

– ఆకాష్‌రెడ్డి, అగసనూరు

ఓపెన్ టెన్త్‌కు దరఖాస్తు చేసుకోండి

కౌతాళం: అర్హులైన వారు ఓపన్ టెన్త్‌కు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గౌరమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చదువు మధ్యలో ఆపేసిన వారికి ఇది మంచి అవకాశమని చెప్పారు. ఈనెల 8వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి, దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఆదోని అర్బన్: స్థానిక శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రాచోటి రామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం భగవాన్ శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ సొసైటీ కేంద్రంలో కాలేజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, బీఈడీ, ఇంజనీరింగ్ కళాశాల నుంచి 130 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ స్థానం ఆర్ట్స్ కళాశాలకు చెదిన మునిస్వామి, ద్వితీయ స్థానం ప్రభుత్వ బాలికల కళాశాల రాధిక, తృతీయ స్థానం పద్మావతి వొకేషనల్ కళాశాలకు చెందిన రామాంజనేయులు నిలిచారు. పర్యవేక్షకులుగా నాగమణి, నర్సయ్య, సంధానకర్తలుగా ఆర్‌ఎంజీ రెడ్డి, లక్ష్మీ కాంత్, కృష్ణ, దీపికారెడ్డి, భీమరెడ్డి, వ్యవహరించారు.

బీమా తక్షణ సాయం అందజేత

కోసిగి: శుక్రవారం మండలంలోని దుద్ది గ్రామంలో బడిగే ఈరన్న (40) అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ బీమా అర్హత ఉండటంతో తక్షణ సాయం కింద రూ.10వేల నగదును మృతుడి భార్య మారెమ్మకు వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు గొర్లి నాగేష్, ఉపసర్పంచ్ కొరవ కిష్టప్ప శుక్రవారం అందజేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సంగీత మాట్లాడుతూ మిగిలిన మొత్తం త్వరలో నామిని ఖాతాలో జమవుతుందని చెప్పారు. నాయకులు తిమ్మయ్య, ముత్తన్న ఉన్నారు.



అమ్మవారి మహా రథాన్ని లాగుతున్న భక్తులు

రమణీయం..రథోత్సవం

కోసిగి: ఆర్లబండ గ్రామంలో శ్రీ అంబా భవానీ మహా రథోత్సవం వేలాదిమంది భక్తుల మధ్య రమణీయంగా సాగింది. శుక్రవారం వేకువజాము నుంచి ఆలయ పీఠాధిపతులు మఠ్రిస్వాముల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు, ఆకు పూజ, ఫలపుష్పాలు సమర్పించి వెండి కవచ అలంకరణ గావించి విశేష పూజలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంకాలం ముందుగా సంప్రదాయబద్ధంగా గ్రామంలోని మేటిగాళ్ల ఇంటి నుంచి పూర్ణ కుంభం ఊరేగింపుగా ఆలయం చెంతకు చేర్చారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి అక్కడి నుంచి పీఠాధిపతి ఊరేగింపుగా రథశాలకు చేరుకున్నారు. అక్కడ రథానికి నైవేద్యం సమర్పించి పూజల అనంతరం అమ్మవారిని రథంపై ఆశీనులు గావించారు. భక్తుల జయజయ ధ్వానాల నడుమ రథాన్ని లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్, సీఐ ఏరిషా వలి, కోసిగి ఎస్‌ఐ రాజారెడ్డి, కౌతాళం, పెద్దతుంబళం ఎస్‌ఐలు, ఏఎస్‌ఐ విజయ్‌కుమార్, స్పెషల్ పార్టీ పోలీస్‌లతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మురళీమోహన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. మండల కన్వీనర్ బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నరసింహులు, మాణిక్యరాజు, బుళ్లి నరసింహులు, కామన్ దొడ్డి నరసింహులు గౌడ, దుద్ది నాగేష్, గొళ్ల పరుశురామ్, హనుమప్ప, కాశీం పాల్గొన్నారు.

లక్ష్యం చేరుకునేలా పనులు చేపట్టండి



అల్లుగుండు చెక్‌డ్యాం పూడికతీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

వెల్దుర్తి: మార్చిలోపు నిర్దేశించిన లక్ష్యం చేరుకునేలా ప్రణాళికతో పనులు చేపట్టాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక ఉపాధి కార్యాలయంలో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల ఏపీఓలు రాజునాయక్, షకూర్, శ్రీనివాసులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రతి గ్రామంలో ప్రతి కూలీకి పని దొరికేలా పనులు చేపట్టి, వలసల నివారణ, పేదల ఆర్థిక స్థితి మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌తోపాటు అనుబంధంగా వివిధ శాఖలలో చేపడుతున్న పనులు వేగవంతం చేయాలన్నారు. అంతకు ముందు ఆయన వెల్దుర్తి మండల పరిధిలోని మల్లెపల్లె సమీపాన రూ.2.80 లక్షల నిధులతో చేపడుతున్న డక్‌అవుట్ పాండ్‌ను సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. భూగర్భ జలాలు పెరిగేలా, పశువులకు నీరు దొరికేలా, మోడల్ పాండ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. అల్లుగుండు గ్రామ సమీపాన చేపడుతున్న చెక్‌డ్యాం పూడికతీత పనులు పరిశీలించారు. ప్రతి శుక్రవారం జరిపే రోజ్‌గార్ దివస్‌లో భాగంగా ఆయా పనుల వద్ద కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానన్నారు. హైవే నుంచి మల్లెపల్లెకు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వెల్దుర్తి ఏపీఓ, ఈసీ భరత్, టీఏ రామాంజనేయులు, ఎఫ్‌ఏలు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పొలంలో వేసిన బోరు రిగ్గు వద్ద నాయకులు

హొళగుంద: రైతుల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని పార్టీ మండల కన్వీనర్ షఫివుల్లా, అగ్రికల్చర్ అడ్వైజర్ బోర్డు మెంబర్ కుమారస్వామి అన్నారు. శుక్రవారం హొళగుంద గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకం కింద మంజూరైన బోర్లను రైతుల పొలాల్లో వేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హొళగుందకు 16 బోర్లు మంజూరైనట్లు తెలిపారు. అర్హులైన రైతుల పొలాల్లో ప్రభుత్వం బోర్లు వేసి సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఎంపీడీఓ దాసానాయక్, నాయకులు కోగిలతోట శేషప్ప, రంగప్ప, సోమిరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో సంక్షేమ దివ్వెలు

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి
- రచ్చుమర్రిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారుకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న వై. ప్రదీప్‌కుమార్ రెడ్డి

మంత్రాలయం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతి గడప గడపలో సంక్షేమ దివ్వెలు విరాజిల్లుతున్నాయని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డితో కలిసి పర్యటించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, చేసిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభాన్ని అధిగమిస్తూ ప్రజల శ్రేయస్సుకు సీఎం వైఎస్ జగన్ అహర్నిశలు పాటు పడుతున్నారన్నారు. అనంతరం జగనన్న కాలనీని సందర్శించి నిర్మాణాలను పరిశీలించారు. జేఎస్‌ఆర్ కంపెనీ చేపడుతున్న నిర్మాణాలను నాణ్యతగా కొనసాగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ భీమిరెడ్డి, ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ సుజాత, నాయకులు రవిరెడ్డి, రోగప్ప, నారాయణ, శ్రీనివాసులు, హనుమంతు, ఈరన్న, నాగేష్, బొజ్జప్ప, లక్ష్మన్న, ఉరుకుంద, భీమా, పెద్దయ్య, ఎంపీడీఓ ప్రభావతి, హౌసింగ్ డీఈ లాల్‌కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేద స్వరూప, ట్రాన్స్‌కో ఏఈ గోవిందు, వ్యవసాయాధికారి గణేష్, ఏపీఎం జయశ్రీ, ఏపీఓ తిమ్మారెడ్డి, ఎస్‌ఐ కిరణ్‌బాబు పాల్గొన్నారు. అలాగే.. మండలంలోని 52–బసాపురం గ్రామంలో ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ ఈఓ సుకుమార్

ఆదోని అరన్: స్థానిక డిప్యూటీ ఈఓ కార్యాలయ ఆవరణలో బహుజన్ టీచర్స్ అసోసియేషన్‌కు చెందిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను డిప్యూటీ ఈఓ సుకుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని, వారికి నాణ్యమైన విద్యను అందించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ పీఆర్‌సీ, పీఏ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. నాయకులు చంద్రశేఖర్ , జయరాం, రామకృష్ణ, చిరంజీవి, రాము, లక్ష్మన్న పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఆలూరు: దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో వెలసిన కొలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయ హుండీ కానుకలను శుక్రవారం దేవదాయ శాఖ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.1,82,411 లభించినట్లు ఈఓ తెలిపారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది శ్రీనివాసులు, సురేష్ గ్రామస్తులు రంగడు, లక్ష్మణ స్వామి, వెంకటేష్, దస్తగిరి, కొలుట్ల ఉన్నారు.



చిగిలి గ్రామంలో తాగునీటి సంపు ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

జన సంక్షేమమే జగనన్న ధ్యేయం

ఆలూరు/ఆస్పరి: జన సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలంలోని చిగిలి గ్రామంలో సర్పంచ్ జయమ్మ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చిగిలి గ్రామంలో రూ.10.45 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ అన్ని వర్గాల వారికి మేలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. అభివృద్ధి చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అంతకుముందు గ్రామంలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన తాగునీటి సంపును మంత్రి ప్రారంభించారు. అనంతరం తిప్పన తాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ స్వామి, ఎంపీటీసీ రాధాకృష్ణ, ఎంపీడీఓ రాధ, ఏఓ మునెమ్మ, కేడీసీసీ చైర్మన్ గోవర్ధన్, నాయకులు రామాంజినేయులు, బసవరాజు, పురుషోత్తం రెడ్డి, పెద్దయ్య, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనం, మద్యం చూపుతున్న సెబ్ పోలీసులు

ఆదోని అర్బన్: పట్టణ శివారు ఆలూరు రోడ్డులో ఓ వ్యక్తి వాహనంలో అక్రమంగా కర్ణాటక మద్యం రవాణా చేస్తుండగా శుక్రవారం సెబ్ అధికారులు దాడి చేసి 50 బాక్స్‌ల ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సెబ్ కార్యాలయ ఆవరణలో స్వాధీనం చేసుకున్న కారు, మద్యం బాక్స్‌లను చూపించారు. విలేకరులతో సీఐ హరికృష్ణ మాట్లాడుతూ వాహనాల తనిఖీలో భాగంగా ఆలూరు రోడ్డులో తనిఖీ నిర్వహించగా ఓ వ్యక్తి కారులో 50 బాక్స్‌లు కర్ణాటక మద్యం తరలిస్తుండటాన్ని గుర్తించగా డ్రైవర్ కారు వదిలి పారిపోయాడని చెప్పారు. కారు, మద్యం బాక్స్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో ఎస్‌ఐ శివ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి రథోత్సవం



భక్త సందోహం నడుమ రథోత్సవం జరుగుతున్న దృశ్యం



ఉత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దకడబూరు : హనుమాపురం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి రథోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం అర్చకులు అమ్మవారి మూలమూర్తికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, తులసీ అర్చన, ఆకుపూజ తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించి మహా మంగళహారతులు ఇచ్చారు. గ్రామస్తులు పిండివంటలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పూజారి చంద్రప్ప ఇంటి నుంచి మేటి కుంభంతో ఊరేగింపుగా వచ్చి రథానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సమూర్తిని రథంపై ఆశీనులు గావించి భక్తజనుల జయ జయ ధ్వానాల మధ్య రథాన్ని బొడ్రాయి వరకు లాగి యథాస్థానానికి చేర్చారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వై.సీతారామిరెడ్డి, రాష్ట్ర వీరశైవ లింగాయిత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు విజయేంద్రరెడ్డి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆదోని వాసి మృతి

ఆదోని అర్బన్: కర్ణాటక రాష్ట్రంలోని గడికే సూగూరు గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని ఖారీబౌడి వీధికి చెందిన దాదా పీర్ (38) మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పని నిమిత్తం దాదా పీర్, అతడి స్నేహితుడు మునీర్ సింధనూరుకు వెళ్లి ఆదోనికి వస్తుండగా గడిగే సూగూర్ గ్రామ సమీపంలో లారీ ఢీ కొట్టింది. స్థానికులు సింధనూరు ఆసుపత్రికి తరలించగా.. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. వస్తుండగా కర్నూలు సమీపంలో మృతి చెందాడు. ప్రమాదంలో మునీర్‌కు గాయాలైనట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి



గాయపడిన చంద్ర

కౌతాళం: మండలంలోని హాల్వి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నలుగురికి గాయాలయ్యాయి. గ్రామంలో సాయంత్రం బీజేపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మరోమారు రాత్రి బీజేపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కారం, వేటకొడవళ్లతో దాడి చేశారు. దీంతో దేవ, చంద్ర, సూరి, వీరేష్‌కు గాయాలు కాగా.. వారిని అంబులెన్స్‌లో ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.